# ఎలియాస్ కరపత్రం బాలగోపాల్

టి. దేవదానం*

కదిలేదీ కదిలించేదీ పెనునిద్దర వదిలించేదీ ఏదైనా ఉందంటే అది బాలగోపాల్‌గారి కరపత్రమే. కందాళ బాలగోపాల్ అని ఆయన మనల్ని విడిచివెళ్లినపుడు పత్రికలలో వచ్చింది గానీ అది డాక్యుమెంట్లలోనే ఉండిపోయిన పేరు. మా మనసుల్లో మాత్రం 'ఎలియాస్ కరపత్రం బాలగోపాల్'గా ఇంకిపోయింది.

చరిత్ర ఎక్కడ దొరుకుతుంది? కదులుతున్న చరిత్రయినా, రగులుతున్న చరిత్రయినా... నమోదు కాని చరిత్రా, ఆమోదం పొందని చరిత్రా ఎక్కడ దొరుకుతుంది? సుబ్రహ్మణం గార్ని అడిగితే 'సారు కరపత్రాలు ఉళ్లే...' అన్నాడు. వర్తమాన చరిత్రను లిఖిస్తున్నామనుకుంటున్న పత్రికల సంపాదక పుటలు వెలవెలబోయేలా చేస్తాయి బాలగోపాల్‌సారు రాసిన కరపత్రాలు. ఆదిలాబాద్ నుంచి మా కృష్ణపట్నం వరకూ ఆయన తిరగని ప్రాంతం లేదు, పరిశీలించని, పరిశోధించని ప్రాంతమూ, అంశమూ లేదు అనిపిస్తుంది నాకు. ఎత్తుకోని సమస్యలేదు. హక్కులేక, హక్కు రాక దిక్కులేని స్థితిలో బిక్కుబిక్కుమని బతుకుతున్న సామాన్య ప్రజానీకమే ఆయన కరపత్రాల నిండా కనిపిస్తారు. ఆయన కరపత్రాలలో విషయం సామాన్యులది. శైలి అనన్య సామాన్యమైనది. అవలీలగా రాసెయ్యడమేకాదు ఎంతో ఆకట్టుకునే విశ్లేషణా, శైలీ కూడా ఉంటుంది అందులో. ఒక్క మాటలో చెప్పాలంటే బాలగోపాల్‌సారు కరపత్రాన్ని సంధిస్తారు. వాటిని బతిమిలాడి ఎవరి చేతిలోనూ పెట్టక్కరలేదు, ఎరగేసుకు పోతారు ఆయన కరపత్రాలను ఎవరయినా. చదివిన ప్రతిసారీ ఇంకొన్ని కొత్త విషయాలు తెలిసినట్టుంటాయి.

---

* **మానవహక్కుల వేదిక నెల్లూరు జిల్లా కార్యదర్శి, సూళ్లూరుపేట**

ఆయన తరచూ ఒకమాట చెబుతుండేవారు. కరపత్రాలు, బులెటిన్లతోసహా మన సాహిత్యాన్ని అందరికీ చేరువచేసే పనిని ఏమాత్రం తక్కువచేసి చూడకూడదని. మన సంస్థలో దానికి తగిన ప్రాముఖ్యం సభ్యులు ఇంకా ఇవ్వడం లేదనేవారు. ఆయన మాటని అనుసరించే నెల్లూరు జిల్లా హెచ్.ఆర్.ఎఫ్ కార్యకర్తలమయిన మేము జిల్లాలోని తడ, సూళ్లూరుపేట, కోట, నాయుడుపేట, గూడూరులలో శిబిరాలు ఏర్పాటుచేసి వేల కరపత్రాలను అచ్చొత్తించి లేదా జెరాక్స్ చేసి ప్రజలకు పంచాము.

మీడియాలో రాయడం, మాట్లాడడం కంటె బాలగోపాల్‌గారు కరపత్రాలకీ, బులెటన్లకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారు. మన వాణిని సంపూర్ణంగా చేరవేసేవి ఇవేనని ఆయన విశ్వాసం. మీడియా ప్రాధాన్యాన్ని ఆయన గుర్తించలేదని కాదు గానీ దాని ద్వారా వచ్చే గుర్తింపు తహతహల దుర్లక్షణానికి తానుగానీ, సభ్యులుగానీ గురవకూడదని భావించేవారు.

ఆయనవని తెలిసిన రచనలు కొన్నయితే తెలియనివి ఎన్నో. రాయలసీమ పాలెగాళ్లమీద రాసిన పుస్తకాలలో ఆయన పేరే కనపడదు. మానవ హక్కుల వేదిక బులెటిన్లలో కూడా పేరు లేకుండా ఆయన రాసిన వ్యాసాలెన్నో. ఆయన రాతల ద్వారా భారతదేశం మొత్తం దర్శించవచ్చు. ఎంతో మేధోశక్తితో, విశ్లేషణతో ఇన్ని రచనలు చేస్తున్నా ఎప్పుడూ ఒక అణకువతో మాట్లాడతారు. డి.డి. కోశాంబి పరిచయాన్ని ఆయన ఎంతో అద్భుతంగా చేసినా 'నాకర్థమైన డి.డి. కోశాంబి' అని మాత్రమే ఎంతో నమ్రతతో చెప్తారు. బహుశా మరొక అభిప్రాయానికీ, చేర్పుకూ అవకాశం ఇచ్చే ప్రజాస్వామిక ధోరణిలోంచి వచ్చిన మాటలు కావచ్చును అవి.

నెల్లూరు జిల్లాకు చివరిసారి వచ్చింది జిల్లా మానవహక్కుల వేదిక మహాసభలకు. రాత్రి మూడు గంటలకు వచ్చి బస్టాండ్‌లోనే నిద్రపోయారు తప్ప ఎవరి తలుపూ తట్టలేదు. ఉదయం 7 గంటలకు సుబ్రహ్మణ్యం సారును కలుసుకున్నపుడు 'మీ ఊర్లో దోమలు బాగా కుడతాయయ్యా' అని సరదాగా మాటల సందర్భంలో అంటే తప్ప ఆ విషయం మాకెవరికీ తెలియలేదు. ఇటువంటి అనుభవాలే ఇతర జిల్లాల సభ్యులకి కూడా ఉన్నాయని నాకు తరువాత తెలిసింది.

## పాదయాత్రనే జీవనయాత్ర చేసుకున్నారు

శిథిలమవుతున్న ఆదివాసీ, దళిత జీవితాల పునరుజ్జీవం కోసం జీర్ణమయిపోయిన చెప్పులతోనే ఆయన ఈ నేలంతా తిరుగాడారు. పాదయాత్రలూ, ప్రచార యాత్రలూ, కొండలూ గుట్టలలో నిజనిర్ధారణలూ అన్నీ ఆ అరిగిపోయిన చెప్పులతోనే. బహుశా పాదయాత్రనే జీవనయాత్రగా మార్చుకున్నాడేమో.

ఎస్ఇజెడ్‌లపై ప్రసంగించడానికి ఒకసారాయన నెల్లూరు జిల్లాలోని తడకు వచ్చారు. సభ నిర్వాహకులు ఆయన మీద మక్కువతో భోజనాలకు ఏం చేయమంటారని అడిగారు. 'తినదగినదేదైనా సరే' అని చెప్పారాయన. ఆకలి తీర్చగల ఆహారం చాలునన్నది ఆయన అభిప్రాయం. టీ దగ్గర మాత్రం కాంప్రమైజ్ లేదు.

ఆయన చావుకు భయపడని వ్యక్తి. భయం చుట్టూ తిరుగుతున్న రాష్ట్ర పరిణామాల్ని ఆయన తన చివరి ప్రసంగంలో నిశితంగా విమర్శించారు. అనంతపురంలో జరిగిన 3వ రాష్ట్ర మహాసభలలో ఆయన చేసిన 16 నిమిషాల 47 సెకన్ల ప్రసంగాన్ని గనుక విస్తరిస్తే 30 ఏళ్ల ఆయన హక్కుల ఉద్యమ అనుభవం అవుతుంది. 'ఈ రాష్ట్రాన్ని భయం ఏలుతోంది, మేధావులూ, ప్రగతిశీలవాదులూ, విశ్లేషణా చాతుర్యం ఉన్నవాళ్లూ అందరూ భయంతో బ్రతుకుతున్నారు. వాస్తవాలు తెలిసినా స్పందించలేని స్థితికి చేరుకున్నారు' అని ఆరోజు ఆయన పడిన ఆవేదన నా సెల్‌లో ఇప్పటికీ భద్రంగా ఉంది. 'మనకు భద్రత కల్పించేది మన స్వేచ్ఛే; స్వేచ్ఛ కంటే ఎక్కువగా భద్రత కల్పించేది మరొకటి లేదు' అని కార్ల్‌పాపర్ అనే ఆయన అన్నట్టు ఎక్కడో చదివాను. అది సారుకు కరెక్టుగా సరిపోతుందనిపిస్తుంది.

ఎన్నో తలపులు. నావీ, నాకు ఇతరులు చెప్పినవీ రాసుకు పోవాలనే ఉంది. కాని ఎక్కడో అక్కడ ముగించాలి కదా. ఆలోచననీ, ఆచరణనీ విడదీసి చూస్తే బాలగోపాల్ లేరు. భావాలను ఆచరణలో పెట్టడంలోనూ, ఆచరణ నుండి భావాలను వృద్ధి చేయడంలోనూ ఆయనకు సాటి ఎవరూ లేరు. ఆయన తన ఆచరణ ద్వారానే అందరికీ జవాబు చెప్పారనిపిస్తుంది. అందుకే ఆయన ఆచరణల మనిషి.